సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



డాడీ హోం రాజారెడ్డి అనుమానాస్పద మృతి

ఎందరో అనాథలను చేరదీసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన డాడీ హోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి (52) మృతి చెందారు. - 8లో



వైభవంగా ముత్తుమారెమ్మ జాతర

నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో ముత్తుమారెమ్మ జాతర శనివారం ప్రారంభమైంది. తొలిరోజు అమ్మవారి కోవెలలో కుంకుమపూజ నిర్వహించారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.1 /26.2

జిల్లాలో శనివారం 26.2 - 33.1 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీడీయూజీకేవై పథకం ద్వారా సీడ్యాప్ సౌజన్యంతో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణతో కూడిన ఉపాధి ఇవ్వనున్నట్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఇందుకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్, అర్హతను బట్టి ప్రైవేట్ సంస్థలో ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 9063082227 నంబరులో సంప్రదించాలన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’ను విజయవంతం చేయాలి

కడప స్పోర్ట్స్ : ఏపీ యువజన సర్వీసులు, క్రీడలశాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న ‘ఆడుదాం ఆంధ్ర’ క్రీడా సంబరాలను విజయవంతం చేయాలని స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ ఒక ప్రకటనలో కోరారు. క్రీడాసంబరాల్లో భాగంగా వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17 సంవత్సరాలపైబడిన వారు క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. అదే విధంగా సంబరాల నిర్వహణ, లోగో, మస్కట్ పోటీలకు యువత దరఖాస్తు చేసుకునేలా వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు.

అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలి

కడప సెవెన్‌రోడ్స్ : అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి సూచించారు. శనివారం కడపలోని 257 పోలింగ్ కేంద్రాల పరిధిలోని సరోజినినగర్‌లో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఓటుహక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ, ఓటరు నమోదు జాబితా–2024కు సంబంధించిన కార్యక్రమం జరుగుతోందన్నారు. మృతి చెందిన, వలస వెళ్లిన ఓటర్ల వివరాలు గుర్తించి ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ శివారెడ్డి, బీఎల్‌ఓ గురులక్ష్మి, వీఆర్వో శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన టమాటా ధర

కడప అగ్రికల్చర్ : మొన్నటి వరకు కిలో రూ. 100 ఉన్న టమాటా ధర దిగొచ్చింది. రైతుబజార్‌లో కిలో రూ. 42కు విక్రయిస్తున్నారు. దీంతో వినియోగదారులకు ఊరటనిచ్చింది. మిగిలిన కూరగాయల ధరలు కూడా తగ్గుముఖం పడుతున్నాయి. వారం క్రితం కిలో రూ. 98 ఉన్న బీన్స్ ప్రస్తుతం కిలో రూ. 70 చేరుకుంది. కిలో రూ. 70 ఉన్న మిరప రూ.40కి చేరింది.కానీ అల్లం మాత్రం నెల రోజుల నుంచి కిలో రూ. 250 ఉంది.ఈ ధర నేటికి అలాగే కొనసాగుతోంది.

దండిగా వ్యవసాయం



ఖాజీపేట మండలం చెముళ్లపల్లె వద్ద సాగులో ఉన్న మిరప పంట

- అన్నదాతకు ప్రభుత్వం అండ
- ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటలసాగుకు రుణాలు
- ఇప్పటివరకు రూ. 2470.75 కోట్లు అందజేత

కడప అగ్రికల్చర్ : అన్నదాతకు ప్రభుత్వం వెన్నదన్నుగా నిలుస్తోంది. గతంలో రుణాల కోసం రైతులు బ్యాంకుల చుట్టూ ప్రదర్శనలు చేయాల్సి వచ్చేది. వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయ రంగానికి పూర్తి సహాయ, సహకారాలను అందిస్తూ సాగును ప్రోత్సహిస్తోంది. సేద్యానికి పెట్టుబడి సాయం కింద ఏటా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద నగదును అందిస్తోంది. అలాగే భూగర్భ జలాలు పెరగడం, పై ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండంతో శ్రీశైలం డ్యాంకు కూడా వరద నీరు చేరడం, కేసీ కెనాల్‌కు నీరు విడుదల కానుండటంతో రైతులు కాడి మేడి పట్టి సాగుకు సిద్ధమయ్యారు. ఈ పరిస్థితుల్లో బ్యాంకర్లు సైతం రైతులకు ఉదారంగా రుణాలను అందిస్తూ వ్యవసాయ సాగును ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగంతోపాటు ఇతర రంగాలను రుణాలకు ఇచ్చి ప్రోత్సహిస్తోంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా గతంలో వ్యవసాయ సాగు అంతగా ఉండేదికాదు. దీంతో రైతులకు అప్పులు ఇవ్వడానికి బ్యాంకర్లు సైతం విముఖత చూపించేవారు. ఇప్పుడా పరిస్థితి మారింది. ఉదారంగా రుణాలు అందిస్తున్నారు.గడిచిన మూడేళ్ల నుంచి పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో చెరువులు, నదుల్లో నీరు పుష్కలంగా ఉన్నాయి. దీంతో జిల్లాలో ఏటికేడాది సాగు విస్తీర్ణం పెరిగింది.

2023–24కు ఇవ్వనున్న రుణాల వివరాలు..

జిల్లాలో అన్ని రంగాలకు సంబంధించి 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ. 6676 కోట్లు వ్యవసాయరంగానికి, రూ. 2045 కోట్లు పరిశ్రమలకు, రూ.1007.19 కోట్లు ఇతర రుణాలకు, రూ. 12647 ప్రాధాన్యత రంగాలకు రుణాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ఖరీఫ్ సీజనలో పంటలు సాగు చేసే రైతులకు పెట్టుబడి ఇబ్బందులు లేకుండా మొదటి విడతలో(ఏప్రిల్, మే, జూన్) జిల్లాలోని పలు బ్యాంకుల శాఖ ద్వారా వ్యవసాయ రుణాల కింద ఇప్పటికి రూ. 2470.75 కోట్లు అందించారు. అలాగే పరిశ్రమల రంగాలకు రూ. 1007.19 కోట్లు, ఇతర రుణాలు రూ. 140.74 కోట్లు, ప్రాధాన్యత రంగాలకు కూడా రూ. 5204.77 కోట్లు రుణాలను అందించారు.

2018 నుంచి పంట రుణాల వివరాలు (రూ.కోట్లలో)

ఏడాది	లక్ష్యం	మంజూరు	శాతం
2018–19	3841	4826	125
2019–20	4800	5600	116
2020–21	5500	5354	97
2021–22	6600	7729	117
2022–23	4541	4979	109
2023–24	6676	2470	36.9

2023-24 ఏడాదికిగాను మొదటి విడతలో భాగంగా మంజూరు చేసిన రుణాల వివరాలు..

రుణాలు	ఏడాది టార్గెట్ (కోట్లలో)	ఫస్ట్ క్వాటర్‌కు ఇచ్చిన రుణాలు
వ్యవసాయం	6676.00	2470.75
పరిశ్రమలకు	2045.00	1007.19
ఇతర రుణాలు	1037.00	140.74
ప్రాధాన్యత రుణాలు	12647.00	5204.77

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రుణాలు అందించే అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు బ్యాంకు అధికారులతో సమీక్షలు కూడా నిర్వహించాం. అర్హత ఉండి రుణం కోసం బ్యాంకును ఆశ్రయించే ప్రతి రైతుకు రుణాలను ఇవ్వాలని సూచించాం. ఇతర రంగాలకు కూడా అర్హతను బట్టి రుణాలు మంజూరు చేయాలని చెప్పాం. మార్చినాటికి లక్ష్యం సాధించడానికి కృషి చేస్తున్నాం.

– సద్దల దుర్గా ప్రసాద్, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

గ్రామస్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యం



ప్రజాదర్బార్‌లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నరేళ్లలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేవిధంగా ప్రభుత్వం పనిచేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు చేసిన మేలును తెలియజేస్తుంటే ప్రతిపక్ష నాయకులు పలు రకాల యాత్రల పేరుతో వారిని రెచ్చగొట్టేవిధంగా ప్రసంగాలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రజలను మోసగించేందుకు అనేక అబద్ధపు హామీలను ఇస్తున్నాడన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98శాతం హామీలను నెరవేర్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని కుటిల రాజకీయాలు చేసినా ప్రజలు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టడం తథ్యమన్నారు. అనంతరం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు.అంతకుముందు వైఎస్ జగన్ క్యాంప్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీనుంచి ప్రారంభమయ్యే శ్రీగండి ఆంజనేయస్వామి శ్రావణమాస మహోత్సవ పోస్టర్లను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు వైఎస్ మధురెడ్డిలు ఆలయ ఈఓ ముకుందారెడ్డితో కలసి ఆవిష్కరించారు.

దేశభక్తిని పెంపొందించుకోవాలి

కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ విజయరామరాజు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు

చింతకొమ్మదిన్నె : ప్రతి ఒక్కరూ దేశ భక్తిని, జాతీయ సమైక్యతను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చింతకొమ్మదిన్నె మండలంలోని గ్రామ సచివాలయం, వైఎస్సార్ రైతు భరోసా సముదాయాల పరిధిలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో ‘మేరీ మట్టి మేరా దేశ్’కార్యక్రమంలో భాగంగా ‘నా భూమి – నా దేశం’, ‘నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం’ శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం కోసం త్యాగాలు చేసిన త్యాగధనులను, వీరులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. ఎందరికో జన్మనిచ్చిన మన మాతృభూమిని గుర్తుచేసుకోవడం దేశభక్తికి స్ఫూర్తి గా నిలుస్తుందన్నారు.

పంచ్ ప్రాణ ప్రతిజ్ఞ

‘మేరీ మట్టి, మేరా దేశ్’ అంటూ...అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడంలో నా వంతు పాత్ర పోషిస్తానని, వలసవాద మనస్తత్వం జాడను నా నుంచి తొలగిస్తానని, మన సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని ప్రచారం చేయడం కోసం పాటుపడతానని, దేశం కోసం పోరాడిన త్యాగధనుల త్యాగాన్ని గౌరవిస్తానని, దేశ రక్షణ,పురోగతికి నన్ను నేను అంకితం చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నాను అని కమలాపురం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం దేశానికి, మాతృభూమికి సేవలందించిన రిటైర్డ్ ఏఎస్‌ఐ జయరాముడు , మాజీ సైనికుడు రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ సుబ్బారెడ్డి, మాజీ సైనికుడు బీమా సంజీవ్ వీరులను సత్కరించారు. అనంతరం జాతీయ జెండాను ఎగరవేసి జెండాకు వందనం చేశారు. ప్రజలతో కలిసి జాతీయ గీతం ఆలపించారు. కడప ఆర్డీవో ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ యధుభూషణ్ రెడ్డి, ఎంఎస్‌ఓ శారదమ్మ, ఎంపీడీఓ రవికుమార్ రెడ్డి, సర్పంచ్ మహేశ్వరి, ఎంపీటీసీ అరుణ పాల్గొన్నారు.

మనులో ‘మేరీ మట్టి మేరాదేశ్’

కడప ఎడ్యుకేషన్ : కడపలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ‘మేరీ మట్టి మేరా దేశ్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ విజయరామరాజుకు కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ మోహమ్మద్ సికిందర్ హుస్సేన్ మొక్క ను అందించి స్వాగతం పలికారు.

కాకినాడ–తిరుపతి మధ్య ప్రత్యేక రైలు



కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కాకినాడ–తిరుపతి (07063/64) మధ్య రెండురోజులపాటు ప్రత్యేక రైలును నడపనున్నారని రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, రైల్వేస్టేషన్ మేనేజర్ డీఎస్ రెడ్డి తెలిపారు. 13, 14, 15 తేదీల్లో నాలుగు ట్రిప్పులుగా ఈ రైలును నడుపుతున్నారన్నారు. ఈనెల 13న తిరుపతిలో రాత్రి 9.30 గంటలకు రైలు బయలుదేరి కడప మీదుగా మరుసటిరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడకు చేరుతుందన్నారు. తిరిగి కాకినాడలో సాయంత్రం 4.00 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 9.00 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. తిరుపతి, రేణిగుంట, కోడూరు, రాజంపేట, నందలూరు, కడప, కమలాపురం, ఎర్రగుంట్ల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, కోయిలకుంట్ల, బనగానపల్లె, నంద్యాల, గిద్దలూరు, కంభం, మార్కాపురం, దొనకొండ, వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, మంగళగిరి, కృష్ణా కెనాల్, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు, రాజమండ్రి, సామర్లకోట మీదుగా కాకినాడుకు వెళుతుందన్నారు.

నరసాపురం–తిరుపతి మధ్య..

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఈనెల 13, 14, 15 తేదీల్లో నరసాపురం–తిరుపతి (07061/62) మధ్య ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈనెల 13న నరసాపురంలో సాయంత్రం 6.30 గంటలకు బయలుదేరి కడపకు మరుసటిరోజు తెల్లవారుజామున 6.42కు చేరుకుని 10.30 గంటలకు తిరుపతి వెళుతుందన్నారు. తిరిగి తిరుపతిలో అదేరోజు రాత్రి 8.15 గంటలకు బయలుదేరి 10.36 గంటలకు కడపకు చేరుకుని మరుసటిరోజు మధ్యాహ్నం 12.15 గంటలకు నరసాపురం చేరుతుందన్నారు.

క్లుప్తంగా

అభాగ్యురాలిని ఆదుకోవాలి



కాలువ కల్వర్టుపై ఉన్న వెంకటమ్మ

కడప రూరల్ : ఇక్కడ అచేతనంగా ఉన్న వృద్ధురాలి పేరు వెంకటమ్మ. ఈమె ఊరు అన్నమయ్య జిల్లా రాయచోటి వద్ద గల మూలపల్లె. కాశినాయన మండలం జ్యోతిక్షేత్రం, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాలు తిరుగుతుండగానే.. కాళ్లు, చేతులు సచ్చుపడిపోయాయి. అనారోగ్యంతో కడప నగరం పెద్ద దర్గా ప్రాంతానికి చేరింది. అక్కడ ఒక కాలువపై నిర్మించిన కల్వర్టుపై ఉంటోంది. ఎవరైనా అనాథాశ్రమం నిర్వాహకులు స్పందించి అక్కున చేర్చుకోవాలి. వృద్ధురాలిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌బాషా తెలిపారు.

జంగంపల్లెలో ఉద్రిక్తత



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

కమలాపురం : మండలంలోని జంగంపల్లెలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలోని రామాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారి ఊరేగింపు నిర్వహణలో ఇరు వర్గాల మధ్య విభేదాలు వచ్చాయి. గతంలో జరిగే విధంగానే ఊరేగింపు నిర్వహించాలని ఒక వర్గం, తమ ఇంటి వద్ద నుంచే ప్రారంభించాలని మరో వర్గం వాగ్వివాదానికి దిగాయి. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. కడప తాలూకా సీఐ ఉలసయ్య, కమలాపురం, వీఎన్‌పల్లె ఎస్‌ఐలు చిన్న పెద్దయ్య, కులాయప్పలు తమ సిబ్బందితో అక్కడికి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. అలాగే గ్రామంలో ఊరేగింపు నిర్వహణను రద్దు చేశారు. దీంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి.

చౌక బియ్యం పట్టివేత

రామాపురం : మండల కేంద్రంలోని బస్‌స్టాప్ వద్ద విజిలెన్స్ సీఐ రెడ్డప్ప, రాయచోటి పౌరసరఫరాల సంస్థ డీటీ కృపావతి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 270 చౌక (రేషన్) బియ్యం బస్తాలు తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరు మండలం చక్కెరచెట్టు వీధికి చెందిన షేక్ ఖాజా చెన్నూరు నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తుండగా మార్గమధ్యంలో లారీని పట్టుకున్నారు. అందులో 270 బస్తాలు అనగా సుమారు 12,956 కేజీలు బియ్యం ఉన్నాయి. లారీని, డ్రైవర్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

డాడీ హోం రాజారెడ్డి అనుమానాస్పద మృతి

- పూజా స్కూల్ ప్రాంగణంలో పడి ఉండగా ఆస్పత్రికి తరలింపు
- అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు
- అనుమానంతో రీ పోస్టుమార్టం
- శరీరంపై గాయాలు



రాజారెడ్డి మృతదేహం



రాజారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : ఎందరో అనాథలు, అభాగ్యులను చేరదీసి వారికి కొత్త జీవితాన్ని ప్రసాదించిన డాడీ హోం వ్యవస్థాపకుడు రాజారెడ్డి (52) అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. పూజాస్కూల్ ప్రాంగణంలో పడి ఉండగా ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు, సన్నిహితులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాళెం మండలంలోని పర్లపాడు గ్రామానికి చెందిన నల్లదిమ్మ రాజారెడ్డి సుమారు 20 ఏళ్ల నుంచి మైలవరంలో డాడీ హోం నిర్వహిస్తున్నారు. ఆయన పెళ్లి చేసుకోలేదు. పెద్దముడియం మండలంలోని పాలూరు గ్రామంలో చర్చి ఫాదర్‌గా కొనసాగుతున్నారు. అనాథ, ఎయిడ్స్ బారిన పిల్లలతోపాటు వృద్ధులకు డాడీ హోంలో ఆశ్రయం కల్పించి వారి పోషణా బాధ్యతలను చూస్తున్నారు. అలాగే ప్రొద్దుటూరు మండలంలోని చౌడూరు గ్రామం సమీపంలో సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో పూజా ఇంటర్నేషనల్ స్కూల్, ప్రొద్దుటూరులోని జిల్లా ఆస్పత్రి వెనుక భాగంలో పూజా కిడ్స్ స్కూళ్లను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. రాజారెడ్డి సోదరుడు శ్రీధర్‌రెడ్డితో పాటు అతని భార్య ప్రసన్నలక్ష్మిలు పూజా స్కూల్‌లోనే ఉంటూ నిర్వహణా బాధ్యతలు చూస్తున్నారు. శనివారం, ఆదివారం పాఠశాలకు సెలవులు రావడంతో పూజా స్కూల్‌లోని విద్యార్థులను ఇళ్లకు పంపించారు. దీంతో పూజా స్కూల్లో దూరప్రాంతాలకు చెందిన కొందరు విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, పని మనిషులు మాత్రమే ఉన్నారు.

రాత్రి శబ్దం రావడంతో..

శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో స్కూల్ ప్రాంగణంలో పెద్ద ఎత్తున శబ్దం రావడంతో పై అంతస్తులో ఉన్న ప్రిన్సిపాల్ జాన్ హుటాహుటిన కిందికి వచ్చాడు. శ్రీధర్‌రెడ్డి గాబరా పడుతూ కనిపించడంతో.. తిరిగి ఆయన పైకెళ్లి తొందరగా కిందికి రావాలని తోటి ఉపాధ్యాయులను పిలిచాడు. దీంతో ఉపాధ్యాయులతోపాటు పీఈటీ రామాంజనీ కిందికి వచ్చారు. వారు వచ్చేసరికి కింద పడిపోయిన రాజారెడ్డికి శ్రీధర్‌రెడ్డి, అతని భార్య లక్ష్మీప్రసన్న, కుమార్తెలు సపర్యలు చేస్తున్నారు. కొద్ది సేపటి తర్వాత రాజారెడ్డిని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు చెప్పారు. విషయం తెలియడంతో సీఐ ఇబ్రహీంతో పాటు రూరల్ ఎస్‌ఐలు చిరంజీవి, శివప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రాజారెడ్డి మృతదేహంపై ఎక్కువ గాయాలు ఉండటం అనేక అనుమానాలను రేకెత్తిస్తోంది. వీపు, ముఖం, చేతులకు గాయాలున్నాయి. దీంతో ఆయన మృతిపై బంధువులు, పూజా స్కూల్ సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అనుమానాలను పెంచిన రీ పోస్టుమార్టం

పూజా స్కూల్ పీఈటీ రామాంజనీ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం రాజారెడ్డి మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలోని డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పూజా స్కూల్‌కు తరలించారు. విద్యార్థులు, బంధువుల సందర్శనార్థం కొంత సేపు అక్కడ ఉంచి తర్వాత మైలవరంలోని డాడీ హోంకు మృతదేహాన్ని తరలించాలని భావించారు. అక్కడే ఉన్న పోలీసు అధికారులకు అనుమానం రావడంతో మరింత లోతుగా రీ పోస్టుమార్టం నిర్వహించాలని డీఎంహెచ్‌ఓను కోరారు. రీ పోస్టుమార్టం నిర్వహించేందుకు కడప నుంచి ప్రొఫెసర్ల బృందాన్ని పంపించనున్నట్లు డీఎంహెచ్‌ఓ తెలిపారు. దీంతో పూజా స్కూల్‌లో ఉన్న రాజారెడ్డి మృతదేహాన్ని తిరిగి జిల్లా ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రొఫెసర్లచే రీ పోస్టుమార్టం చేయించారు. పోస్టుంమార్టం తర్వాత రాజారెడ్డి మృతిపై పోలీసులకు అనుమానాలు మరింతగా పెరిగినట్లు తెలుస్తోంది. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సాయంత్రం మైలవరంలోని డాడీ హోంలో రాజారెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు. రాజారెడ్డి మృతితో డాడీహోంలోని అనాథ పిల్లలు బోరున విలపించసాగారు. రాజారెడ్డి తల్లి సుబ్బమ్మ కుమారుని మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించింది.

పోలీసు అధికారుల దర్యాప్తు

ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్, జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు జిల్లా ఆస్పత్రికి చేరుకొని స్కూల్ నిర్వాహకులతో మాట్లాడారు. పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులతో కూడా పోలీసు అధికారులు చర్చించారు. కాగా ఇటీవల పూజాస్కూల్ నిర్వహణకు సంబంధించి పూర్తి స్థాయి బాధ్యతలను చిన్నప్పటి నుంచి అక్కడే పెరిగిన ఇరువురు అనాథ బాలికలకు అప్పగించినట్లు తెలిసింది. ఈ కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ప్రముఖుల నివాళులు

రాజారెడ్డి మృతదేహాన్ని పలువురు ప్రముఖులు సందర్శించి నివాళులు అర్పించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పూజాస్కూల్‌లో ఉన్న రాజారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. సేవకు మారుపేరుగా నిలిచిన రాజారెడ్డి మరణం తనను ఎంతగానో కలచి వేసిందని ఆయన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ఏఎస్పీ లోసారి సుధాకర్‌తోపాటు రాజుపాళెం మండలంలోని రాజారెడ్డి బంధువులు, సన్నిహితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పూజా స్కూల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు రాజారెడ్డిని కడసారి చూడటానికి వచ్చారు.



పూజా స్కూల్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జమ్మలమడుగు డీఎస్పీ నాగరాజు



విలపిస్తున్న డాడీ హోం అనాథ బాలికలు, బంధువులు

గుర్తుతెలియని వ్యక్తి మృతి



కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి శనివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి దాదాపు (70 సంవత్సరాలు)ని క్యాజువాలిటీకి తీసుకుని వచ్చారు. అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారు. ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు ఆదేశాల మేరకు సిబ్బంది క్యాజువాలిటీ నుంచి మార్చురీకి తరలించారు. ఎవరైనా ఆచూకీ తెలిస్తే నేరుగా తమను సంప్రదించాలని డాక్టర్ శ్రీనివాసులు తెలియజేశారు.

రైలు కింద పడి..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ పరిధిలో ప్రొద్దుటూరు– ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ల మధ్య మాలెపాడు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి ధర్మవరం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని ఎర్రగుంట్ల రైల్వే ఎస్‌ఐ కే రారాజు శనివారం తెలిపారు. మృతుడు తెల్లని కాటన్ హాఫ్ చొక్కా ధరించాడు. దానిపై బీఎస్‌ఆర్ టైలర్స్ అని రాసి ఉంది. ఆకుపచ్చ అంచు తెల్లటి పంచె ధరించాడు. ఎవరైనా ఆచూకీ గుర్తిస్తే ఎర్రగుంట్ల పోలీసులకు తెలియజేయాలని రైల్వే ఎస్‌ఐ కోరారు.

విద్యుత్ షాక్‌తో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొప్పర్తి పంచాయతీ పరిధిలో గల ప్రకాశంపల్లె దళితవాడకు చెందిన ఈశ్వరయ్య (35) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఆయన తన ఇంటి నిర్మాణ పనుల్లో ఉండగా శుక్రవారం రాత్రి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆయనకు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ భూమా అరుణ్‌రెడ్డి తెలిపారు.

దేవాలయాలు, అర్చక వ్యవస్థకు ప్రభుత్వం తోడ్పాటు



డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను వేదాశీస్సులతో సత్కరిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలు, అర్చకుల వ్యవస్థకు ఎంతో తోడ్పాటు అందిస్తోందని, మునుపెన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా అన్నారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శంకరమఠంలో ఆయన శనివారం కడప నగరానికి చెందిన వివిధ దేవాలయాల్లో పని చేస్తున్న 150 మంది అర్చకులకు నిత్యావసర సరుకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో శాంతి నెలకొనేందుకు కృషి చేస్తున్న అర్చకులు, దేవాలయాల వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూసేందుకు కరోనా సమయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకున్నదని తెలిపారు. అర్చకులకు జీతభత్యాలు, ఆలయాల రక్షణకు పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్చక సమాఖ్య అధ్యక్షులు, కార్యక్రమ నిర్వాహకులు విజయ్ భట్టర్ మాట్లాడుతూ నగర శివార్లలోని మామిళ్లపల్లె లే అవుట్‌లో ఇంతకుముందు ప్రకటించినట్లుగా అర్చక సమాఖ్య కోసం స్థలాన్ని కేటాయించాలని, మోచంపేటలోని శంకరమఠాన్ని సమాఖ్య నిర్వహణ కోసం అందజేయాలని కోరారు. ఇందుకు డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందిస్తూ ఈ విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా అర్చకులు సామూహికంగా డిప్యూటీ సీఎంకు వేదాశీస్సులు అందజేసి ఘనంగా సత్కరించారు.

రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో..

స్థానిక కళాక్షేత్రం వద్దగల రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షులు వైఎస్ సాయిబాబా అధ్యక్షతన ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా జన్మదినాన్ని పురస్కరించుకుని క్లబ్ చైర్మన్ మురళితో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ కళాకారుల క్షేమం పట్ల ఎంతో చిత్తశుద్ధితో పార్టీ పక్షాన కళాకారులైన వారితో సాంస్కృతిక విభాగాన్ని ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. సభ్యులంతా ఎప్పటికప్పుడు సమస్యలను కళారూపాల ద్వారా సమాజం దృష్టికి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం సాంస్కృతిక కమిటీ ఉపాధ్యక్షులు ప్రకాశం, శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళి, గంగయ్య, రాజేష్‌బాబు తదితరులు డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించి ఆయన పేరిట కేక్ కట్ చేశారు.

ఏపీజీఈఎఫ్ రాష్ట్ర కో చైర్మన్‌గా లెక్కల జమాల్‌రెడ్డి



కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో రాష్ట్ర కో చైర్మన్‌గా ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం గుంటూరులోని రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యవర్గ ఎన్నికల్లో వైఎస్సార్ జిల్లాకు చెందిన జమాల్‌రెడ్డిని రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇందుకుగాను మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, పీఎస్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పీసీ రెడ్డెన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏసీవీ గురవారెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మునిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ కన్వీనర్ మజహరుల్‌హక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయరెడ్డి, సీపీఎస్ కన్వీనర్ గుజులపల్లె నారాయణరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్‌వీ సుబ్బారెడ్డి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బోగా వెంకటసుబ్బయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

మహిళను దూషించిన న్యాయవాదిపై కేసు

ప్రొద్దుటూరు క్రైం : మహిళను దూషించిన సంఘటనలో న్యాయవాది చంద్రశేఖర్‌పై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుబ్బిరెడ్డి కొట్టాలకు చెందిన బండి లక్ష్మీదేవి తన కుమార్తె విడాకుల విషయమై 2021లో శీతంపల్లెకు చెందిన న్యాయవాది చంద్రశేఖర్‌ను సంప్రదించి రూ.32 వేలు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరగడంతో లక్ష్మీదేవి కుమార్తె, అల్లుడు ఒకటయ్యారు. ఇదే విషయాన్ని ఆమె ఈ నెల 9న న్యాయవాదికి వివరించింది. విడాకులు అవసరం లేదని తెలిపింది. తాను ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగింది. దీంతో అతను డబ్బులు అడుగుతావా అని లక్ష్మీదేవిని దూషించాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు త్రీ టౌన్ పోలీసులు తెలిపారు.

వైభవంగా ముత్తుమారెమ్మ జాతర



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆగమ పండితుడు



నాగిరెడ్డిపల్లె అర్బన్ ప్రాంతంలో ముత్తుమారెమ్మ ఊరేగింపు

నందలూరు(రాజంపేట) : తమిళులతోపాటు స్థానికులు ఆరాధ్యదైవంగా పూజించే ముత్తుమారెమ్మ జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. నందలూరు రైల్వేకేంద్రంలోని అరవపల్లెలో జాతర మహోత్సవంలో భాగంగా తొలిరోజు అమ్మవారి కోవెలలో కుంకుమపూజ వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా తమిళనాడు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. రాష్ట్ర బ్రహ్మణ సేవా సంఘం సమాఖ్య మాజీ ఉపాధ్యక్షుడు స్మార్త ఆగమ పండితుడు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అరవపల్లెలో ఆధ్యాత్మిక సందడి వాతావరణం నెలకొంది. అనుబంధం వున్న తమిళ కుటుంబాలతోపాటు పలువురు కార్మికుల కుటుంబాలు తరలివచ్చారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జాతర మహోత్సవంలో భాగంగా శనివారం రాత్రి ముత్తుమారెమ్మ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి భక్తులు దారిపొడవునా కాయకర్పూరం సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

నేడు ప్రధాన ఘట్టం : ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జాతరను ఆదివారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు సందర్శించనున్నారు. అలాగే మహిళలు పొంగుబాళ్లు పెట్టుకుంటారు. ఇందుకు తగ్గట్టుగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వీఎన్‌పల్లెకు చేరిన పాదయాత్ర



జిలానీ బాషా పాదయాత్రకు సంఘీభావం తెలిపిన రఘునాథరెడ్డి

వీరపునాయునిపల్లె : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మార్కాపురానికి చెందిన జిలానీ బాషా చేపట్టిన పాదయాత్ర శనివారం వీరపునాయునిపల్లెకు చేరుకొంది. ఆయనకు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిలానీ బాషా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలన్న సంకల్పంతో మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు జూలై 7వ తేదీ నుంచి పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. నంద్యాల, కర్నూలు, హిందూపురం మీదుగా ఇడుపులపాయకు చేరుకొని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళి అర్పించడం జరిగిందని తెలిపారు. 797 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించడంతోపాటు వారి అవసరాలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.